
## ఘనంగా అరవింద్ శర్మ జన్మదిన వేడుకలు




**విశ్వంభర, సరూర్ నగర్ :** మహేశ్వరం నియోజవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ జన్మదిన వేడుకలు ఆర్కె పురం లోని పార్టీ కార్యాలయం లో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. నెంటూరీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం అరవింద్ శర్మ మాట్లాడుతూ జన్మదిన శుభా కాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. అభిమానం ఎప్పుడు తనపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, రామా చారి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, వల్లూరి రమేష్, రమేష్ కురుమ, జాహీద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం చైర్మన్‌గా చెరుపల్లి రాధ




**విశ్వంభర, మర్రిగూడెం :** వట్టిపల్లి మిశ్రమ చేనేత పారిశ్రామిక సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో చెరుపల్లి రాధ చైర్మన్ అభ్యర్థి ఘన విజయం సాధించారు. ప్యానెల్ 9 డైరెక్టర్ లకు గాను 5 డైరెక్టర్ లను గెలిపించుకొని సంఘం అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా డైరెక్టర్ లు ఎన్నుకోవడం జరిగింది, తనని అధ్యక్షురాలుగా, తన ప్యానెల్ సభ్యులను కూడా గెలిపించి మద్దతు తెలిపిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలో ఉన్న సభ్యులకు,నేత కార్మికులకు, పద్మశాలి నాయకులకు ధన్యవాదములు తెలిపారు. ఈ యొక్క సంఘాన్ని అన్నివిధములగా అభివృద్ధి పదం లో నడిపిస్తూ ప్రభుత్వ పథకాలు నేత కార్మికులకు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం తో స్పెషల్ ప్యాకేజ్ లు ఏర్పాటు చేయిస్తానని అన్నారు. అలాగే క్లస్టర్ ఏర్పాటు కోసం కృషి చేసి చేనేత కార్మికులకు భరోసానిచ్చారు.

## రక్తదాతను సన్మానించిన చేపూరి శంకర్



**విశ్వంభర, హైదరాబాద్ :** రిటైర్డ్ డిఎస్పి వీ ఎస్ రత్నం కుమారుడు, పూర్వ హెడ్ మాస్టర్ వడ్డే రత్నాకర్ రావు 28 సార్లు రక్తదానం చేసిన సందర్భంగా మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు చేపూరి శంకర్ రత్నాకర్ రావు శారద దంపతులకు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం చేపూరి శంకర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం తో సమానం అని, రక్తం మిచ్చు ప్రతి మనిషిదైవ సమానం అని అన్నారు. నేటి సమాజంలో రత్నాకర్ లాంటి వ్యక్తులు ఉండడం చాలా గొప్ప విషయం అని అన్నారు. తాను చనిపోతే కూడా తన అవయవాలను దానం చేయడానికి సిద్ధంగా ఉన్నానని రత్నాకర్ రావు చెప్పడం గొప్ప విషయం అని అన్నారు. ఆయనను స్ఫూర్తి తీసుకొని యువత ముందుకెళ్లాలని శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సంఘ సేవకురాలు చేపూరి సునీత, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన



**విశ్వంభర, చండూర్ :** కిషోర్ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరమునకు అపూర్వ స్పందన లభించింది. అభయ బ్లడ్ బ్యాంకు హైదరాబాద్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరం చండూరు మండలం దోనీపాముల గ్రామంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దోనిపాముల గ్రామ సర్పంచ్ దాసరి అలివేలు స్వామి హాజరై ప్రారంభించారు. వీరితో పాటు వార్డు మెంబెర్స్ శ్రవణ్, కొండపల్లి నర్సింహా, ఆలేటి లక్ష్మి అయోధ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కిషోర్ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో చేపట్టిన బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తదానం కార్యక్రమం పెట్టడం చాలా అభినందనీయం అని అన్నారు. అలాగే ఈ సంస్థ వారు మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని అన్నారు. కిషోర్ హెల్పింగ్ సంస్థ నిర్వాహకులు కర్నాటి కిరణ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎంతో మంది ప్రమాదాల కారణంగా గాని, శస్త్ర చికిత్సల కోసం గాని రక్తం దొరకక చాలామంది చనిపోతున్నారని అలాంటి వారి కోసం కిషోర్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలలో దాదాపు 25 కు పైగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఒక వెయ్యి మందికి పైగా రక్తదానం చేసారని అన్నారు.ఈ కార్యక్రమంలో యువకులు, స్థానికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి : వినయ్ కిషోర్ యాదవ్

**విశ్వంభర, మలక్ పేట్ :** చంచల్‌గూడ ముద్రణాలయం నుంచి ఐఎస్ సదన్ మీదుగా సంతోష్‌నగర్ వరకు నిర్మితమవుతున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ప్రముఖ సంఘ సేవకురాలు, దివంగత సంగం లక్ష్మీబాయి పేరు నామకరణం చేయాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫ్ఫార్ హుస్సేన్ మిరాజ్ లకు వినతిపత్రం అందజేశారు.సానుకూలంగా స్పందించిన ఎంఐఎం నాయకులు. అనంతరం సైదాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వినయ్ కిషోర్ యాదవ్ మాట్లాడుతూ, సంగం లక్ష్మీబాయి నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దశాబ్దాల క్రితమే ఇందిరా సేవా సదన్ విద్యాసంస్థలను స్థాపించి వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందించే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. ఆ విద్యాసంస్థల్లో చదువుకున్న వారు నేడు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. సంఘసంస్కర్తగా, రాజకీయ నాయకురాలిగా, విద్యావేత్తగా విశేష సేవలు అందించిన సంగం లక్ష్మీబాయి సైదాబాద్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొంటూ, ఆమె సేవలకు గుర్తింపుగా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఆమె పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు మద్దతుగా త్వరలో ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, సంబంధిత ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు స్వాభిమాన్ పరిషత్ ప్రతినిధులు రాజు యాదవ్, సంతోష్, లక్ష్మీనారాయణ, దయానంద్, వేణు, రాకేష్, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీనివాస్, శేఖర్, సురేష్, ప్రమోద్ తెలిపారు.



# గీత కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలి

- గౌడల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి
- మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్
- హుస్నాబాద్‌లో మోకు దెబ్బ ఆధ్వర్యంలో గౌడ జన హక్కుల పోరాట సమితి సమావేశం



**విశ్వంభర, హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని బీఎంకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం "గౌడ జన హక్కుల పోరాట సమితి" (మోకు దెబ్బ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పచ్చిమట్ల స్వామి గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద ఎక్స్‌గ్రేషియా, పెన్షన్, బీమా, అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టీసీఎస్, టీఎఫ్‌టీల లైసెన్సులను వెంటనే జారీ చేయడంతో పాటు, దరఖాస్తు చేసిన వారికి 30 రోజుల్లోగా లైసెన్సులు మంజూరు చేసే విధానాన్ని అమలు చేయాలని అన్నారు.లైసెన్సులు లేక తాటి చెట్లపై నుంచి పడి మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, బీమా, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 50 శాతం లైసెన్సులను గౌడ సమాజానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. జీవో నెం.560ను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని తాటి, ఈత, గిరక తాళ్ల అభివృద్ధికి కేటాయించాలని కోరారు.గీత కార్పొరేషన్ అభివృద్ధికి రూ.5,000 కోట్లు కేటాయించాలని, తాటి చెట్లు ఎక్కడానికి ఆధునిక భద్రతా పరికరాలు, పనిముట్లు ఉచితంగా అందించాలని అన్నారు. కల్లు సహజ ఆహార పానీయం కావడంతో దానిని ఎక్సైజ్ శాఖ పరిధి నుంచి తొలగించి ఫుడ్ అండ్ బెవరేజెస్ శాఖ పరిధిలోకి తీసుకురావాలని, గీత కార్మికులపై పోలీసు, ఎక్సైజ్ శాఖల వేధింపులను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నీరా పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించి గౌడ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు "సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లా"గా పేరు పెట్టాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంత గౌడులకు ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేసి వారి రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని, "మా జనాభా ఎంతైతే... మా వాటా అంతే" అనే సూత్రం ప్రకారం గౌడ సమాజానికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు అన్ని ప్రజాప్రతినిధి స్థానాల్లో సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మోకు దెబ్బ జిల్లా కార్యవర్గంలో పలువురు నాయకులను నియమించారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా కందుల శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా రాగుల పరుశ రాములు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా చెరపల్లి లక్ష్మణ మూర్తి, మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రంగగోని గంగారం గౌడ్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బూర వెంకన్న గౌడ్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాకాల శ్యాంసుందర్ గౌడ్, హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా పూదరి రవీందర్ గౌడ్, కోహెడ మండల అధ్యక్షుడిగా బబ్బురు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్, చిగురు మండల అధ్యక్షుడిగా కక్కెర్ల సంపత్ కుమార్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గడ్డం సమ్మయ్య గౌడ్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజు గౌడ్, జాతీయ కోశాధికారులు ఏవి జాలేశం గౌడ్, బాలసాని సురేష్ గౌడ్ (మాజీ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్), జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నరసింహులు గౌడ్, మహారాష్ట్ర ఇన్‌చార్జి కదిరె ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రచార కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, మండల స్థాయి గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు, గౌడ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## భూదాన్ భూములకు ప్రత్యేక డిజిటల్ రికార్డులు ఏర్పాటు చేయాలి

- 33 జిల్లాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలి
- భూదాన్ యజ్ఞ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలి
- అర్హులైన పేదలకు భూదాన్ భూములను పంచాలి
- తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలోని భూదాన్ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం, గ్రామం, సర్వే నంబర్, విస్తీర్ణం, హద్దులు, ప్రస్తుత స్థితి, జియోట్యాగింగ్ తదితర వివరాలను నమోదు చేసి డిజిటలైజ్ చేసి ఆన్ లైన్ లో పెట్టాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ వివరాలను తెలంగాణ ఆన్ లైన్ భూ రికార్డుల్లో ప్రత్యేక 'భూదాన్' కేటగిరీగా నమోదు చేస్తే అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలను సమర్థంగా అడ్డుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్ లో ఆదివారం నిర్వహించిన మండలి రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో భూదాన్ భూములపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అనేక భూదాన్ భూములు ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, అక్రమ లావాదేవీలు, అసంపూర్ణ రెవెన్యూ రికార్డుల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారులు, గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది భాగస్వామ్యంతో సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. సర్వేలో అక్రమాలు వెలుగులోకి వచ్చిన చోట ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి భూములను స్వాధీన పరుచుకోవాలని, భూదాన్ భూముల పరిరక్షణ కోసం రాష్ట్రస్థాయి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూదాన్ ఉద్యమానికి తెలంగాణ జన్మభూమి కావడంతో ఈ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా భూదాన్ యజ్ఞ బోర్డు ను ఏర్పాటు చేసి, అర్హులైన పేదలకు భూదాన్ భూములని పంపిణి చేయాలనీ ఆర్. శంకర్ నాయక్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ సర్వోదయ మండలి, రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని అధ్యక్షులుగా సాంబ మల్లేశం, ఉపాధ్యక్షులుగా దాసరి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా వి. బాలు నాయక్, సహాయ కార్యదర్శిగా ఎస్. కొండాలయ్య, కోశాధికారిగా పి. సూర్యం, ప్రతినిధిగా రఘు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా నాగజ్యోతి, ఉపాధ్యక్షురాలుగా ఏ. రాధా, యువజన విభాగం అధ్యక్షులు దయానంద్ కుమార్, కార్యదర్శిగా కె. శివ కుమార్ లను ఎన్నుకున్నట్లు ఆర్. శంకర్ నాయక్ ప్రకటించారు. ఈ సమావేశంలో తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. గిరిప్రసాద్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్. యాదమ్మ, ఉపాధ్యక్షురాలు విజయ, యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శి ఎస్. మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడు ఓటు జాబితాలో ఉండేలా నాయకులు కృషి చేయాలి

**- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తమ నివాసంలో నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై గౌరవ తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) చే ముందుగానే మన నియోజకవర్గ పరిధిలోనే మన భారస పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించడం జరిగింది అని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడం జరిగింది అని, దానిలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నాయకులకు సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల కోసం అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత ఎన్నికల అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## టిఆర్ఎస్‌లో భారీ చేరికలు

**విశ్వంభర, చార్మినార్ :** చార్మినార్, హరి బౌలి డివిజన్లో టిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు సుచితా శ్రీ వాస్తవ్ గారి ఆధ్వర్యంలో హరిబౌలి ఇన్చార్జి సోను భాయ్ చేతుల మీదుగా భారీ చేరికలు జరిగాయి సోను భాయ్ మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలకు ప్రజాపాలన దరఖాస్తు రసీదులు పట్టుకొని చెప్పులు అడిగేటట్టు తిరుగుతుండడం, పెన్షన్స్ రాకపోవడం, 200 యూనిట్ల కరెంటుపై చర్చ కార్యక్రమం నేరుగాప్రజలతో చర్చించారు. సోను భాయ్ మాట్లాడుతూ దీనికి తన వంతు కృషిగా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉన్నానని ధర్నాకు కూడా సిద్ధమని సోను భాయ్ పత్రికా సమావేశంలో తెలిపారు. టిఆర్ఎస్ వెంట ప్రజలుంటే, ప్రజల వెంట నేనున్నానని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో నందాల అనిల్ కుమార్ నేత రాజ్ కుమార్ దీపిక మరియు నూతనంగా జాయిన్ అయినా పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**విశ్వంభర, సరూర్ నగర్ :** సోమవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరూర్నగర్ పరిధిలోగల ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ అర్చన తెలిపారు. పిల్లల కడుపులో ఉండే నట్టల నివారణకు ఈ టాబ్లెట్ ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు ,బడి వయసు పిల్లలు మట్టిలో ఆడుతున్నప్పుడు చేతి గోర్ల ద్వారా నులిపురుగుల గుడ్లు కడుపులో చేరి పెద్దవై పిల్లల ప్రేగులకు అంటుకొని ఉంటాయి.పిల్లలు తీసుకునే పోషకాహారం మొత్తము నులిపురుగులు తినడం వల్ల పిల్లలకు పోషకాహారం లోపం ఏర్పడుతుందని ఆమె తెలిపారు.ఈ పోషకాహార లోపం వల్ల రక్తహీనత ఏర్పడుతుందని తెలిపారు దాంతోపాటు పిల్లలు మగతగా ఉండడము, చురుకుగా లేకపోవడం, క్లాసులో తోటి విద్యార్థులతో కలవకపోవడం, చదువులో వెనుక పడడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతి సంవత్సరం ఆరు నెలల గ్యాప్ తో రెండుసార్లు నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల పిల్లలు సగం టాబ్లెట్ నలిపి తాగు నీటితో కలిపి తాగించవలెనని తెలిపారు .2 నుంచి 19 సంవత్సరంల పిల్లలకు 400 మిల్లీగ్రాములు ఉండే మొత్తం టాబ్లెట్ నమిలి, మింగాలని సూచించారు ఎట్టి పరిస్థితుల్లో గొంతులో డైరెక్టా వేసుకోరాదని తెలిపారు. అంగన్వాడి స్కూల్ , ప్రైమరీ స్కూల్ , హై స్కూల్ విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఈ మాత్రలు ఇస్తామని తెలిపారు . వీరితో పాటు బడి బయటి పిల్లలందరికీ ఈ మాత్రలు ఇస్తామని తెలిపారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం కొరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇందులో బస్తీ దావకాన డాక్టర్లు, యూపీహెచ్సీ డాక్టర్లు,40 మంది ఏఎన్ఎంలు 60 మంది ఆశా కార్యకర్తలు 30 మంది అంగన్వాడీ టీచర్లు, స్కూల్ టీచర్లు మరియు సూపర్వైజర్లు పాల్గొంటారని డాక్టర్ అర్చన తెలిపారు.

## తిరుమల వెంకన్నను దర్శించుకున్న బాబా బాగేశ్వర్

**విశ్వంభర, బషీర్ బాగ్:** బాబా బాగేశ్వర్ శ్రీ ధీరేంద్ర శాస్త్రి తిరుపతిలో మూడు రోజుల ఇంధన సంరక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శ్రీ బాలాజీ దర్శనం కోసం, శ్రీ ధీరేంద్ర శాస్త్రి తన సహచరులతో కలిసి జులై 10వ తేదీన రాత్రి బస కోసం తిరుమలలోని తిరుపతి దేవస్థానంలో ఉన్న శ్రీ జగదీష్ నారాయణి అతిథి గృహం (అగ్రసేన్) తిరుమలకు వచ్చి, జూలై 11వ తేదీన శ్రీ బాలాజీ భగవాన్‌ను సుప్రభాత దర్శనం చేసుకున్నారు. శ్రీ ధీరేంద్ర శాస్త్రి జీతో పాటు ఓం ప్రకాష్ బన్సల్, అంజనీ కుమార్ అగర్వాల్, అశుతోష్ బన్సల్, మనీష్ అగర్వాల్, మున్నా లాల్ అగర్వాల్ కూడా శ్రీ తిరుపతి బాలాజీ భగవాన్ సుప్రభాత దర్శన ప్రయోజనాన్ని పొందారు.ఈ సందర్భంగా భాగ్యనగర సోదరులు శ్రీ ధీరేంద్ర శాస్త్రి గారిని సత్కరించారు. జూలై 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు భాగ్యనగర్‌లో శ్రీ ధీరేన్ శాస్త్రి హనుమాన్ కథను చెప్పనున్నారనే విషయం గమనార్హం. ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి, హనుమాన్ కథను ఆస్వాదించి, ఆ దివ్య సభ నుండి ప్రయోజనం పొందడానికి భాగ్యనగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని శ్రీ ధీరేన్ శాస్త్రి విజ్ఞప్తి చేశారు.భాగ్యనగర్‌కు చెందిన ఓం ప్రకాష్‌జీ బన్సాల్, అశుతోష్ బన్సల్, అంజనీ కుమార్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, మున్నాలాల్ అగర్వాల్ బాబాతో పాటు ఆయన సహచరులతో పాటు శ్రీ జగదీష్ నారాయణి అతిథి గృహం (అగ్రసేన్) తిరుమలలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్లోబల్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రారంభం




**విశ్వంభర, హైదరాబాద్ :** విదేశీ విద్యా రంగంలో నాణ్యత, పారదర్శకత, నైతిక విలువలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో గ్లోబల్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ హైదరాబాద్‌లోని హోటల్ మనోహర్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న 100 మందికి పైగా ప్రముఖ స్టడీ అబ్రాడ్ నిపుణులు, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్లు పాల్గొని అసోసియేషన్ ఆవిర్భావాన్ని స్వాగతించారు. ఈ సందర్భంగా విదేశీ విద్యా రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు, విశ్వవిద్యాలయాల ఎంపికలో పాటించాల్సిన ప్రమాణాలు, వీసా ప్రక్రియ, కెరీర్ మార్గదర్శకత్వం వంటి పలు కీలక అంశాలపై నిపుణులు చర్చించారు. భవిష్యత్తులో విద్యార్థులకు విశ్వసనీయమైన, పారదర్శకమైన మరియు నాణ్యమైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించనుందని వారు పేర్కొన్నారు. జీఇసీఎ వ్యవస్థాపక సభ్యులు మాట్లాడుతూ, విదేశీ విద్యా రంగంలో మోసాలను అరికట్టడం, నైతిక ప్రమాణాలను పెంపొందించడం, సభ్య కన్సల్టెంట్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో బలమైన భాగస్వామ్యాలు ఏర్పరచడం, విద్యార్థులకు సరైన కెరీర్ మార్గదర్శకత్వం అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ స్టడీ అబ్రాడ్ కన్సల్టెంట్లు, విద్యా రంగ ప్రతినిధులు, విశ్వవిద్యాలయ ప్రతినిధులు, అంతర్జాతీయ భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108